
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 20 జూన్ 2024



అసాంఘిక చర్యలకు పాల్పడితే ఉపేక్షించం: ఈస్ట్ సీఐ



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: అసాంఘిక చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఈస్ట్ సిఐ మహేశ్వర్ రెడ్డి ఆకతాయి హెచ్చరించారు. విచ్చలవిడిగా రోడ్లపై తిరుగుతున్న యువతకు ఈస్ట్ పోలీసులు బుధవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానం తాగి అల్లర్లకు పాల్పడితే కేసులు తప్పవన్నారు. రోడ్లపై తిరుగుతున్న వాహనాలకు సరైన పత్రాలు లేకుండా తిరిగిన త్రిబుల్ రైడింగ్‌కు పాల్పడిన సహించమని పేర్కొన్నారు. యువత బాధ్యతగా సంఘంలో మెలిగి మంచి పౌరుడుగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు పికెట్లను కొనసాగిస్తూ

ప్రత్యేక నిఘా పెట్టాలి

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ పీకేట్లను కొనసాగిస్తూ, ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సబ్ డివిజన్ పోలీస్ అధికారులకు సూచించారు. స్థానిక కమాండ్ కంట్రోల్ రూమ్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సబ్ డివిజనల్ పోలీస్ అధికారులతో నేరసమీక్ష సమావేశం ఎస్‌పి బుధవారం నిర్వహించారు. సబ్ డివిజన్ల వారీగా ప్రతి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది, అధికారుల పనితీరును సమీక్షించారు. ప్రతిఒక్క పోలీసు సిబ్బంది, అధికారి జవాబుదారీతనంగా విధులు నిర్వహించాలని, లేని పక్షంలో వారిపై ఉన్నతాధికారులు శాఖపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఇదివరకే జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక గ్రామాలలో ఏర్పాటు చేసి ఉన్న పోలీస్ పికెట్లను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగించాలని డిఎస్పీలకు ఆదేశాలు ఇచ్చారు. ప్రతిరోజు ఎస్‌ఐలు, సీఐలు తమ పరిధిలోని ఏదైనా ఒక గ్రామాన్ని సందర్శించి నూతన చట్టాలపై అవగాహన కల్పించాలి. ఎవరికైనా భూ తగాదాలు ఉంటే వాటిని చట్టపరంగా రెవెన్యూ అధికారుల ద్వారా పరిష్కరించుకునేలాగా అవగాహన కల్పించాలి. ఎస్‌హెచ్‌ఓలు తమ పరిధిలోని ప్రాంతాలు/ గ్రామాలలో ఎవరైనా సమస్యలు సృష్టించే వారు ఉంటే, అట్టి వారిపై కేసులు నమోదు చేసి, షీట్లను ఓపెన్ చేసి ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశాలు ఇచ్చారు. బహిరంగంగా మద్యం సేవించే ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని వెంటనే శుభ్రం చేపించి, నిరంతర నిఘా పెట్టడం వలన బహిరంగంగా మద్యం సేవించడానికి నిర్మూలించవచ్చు అని చెప్పారు. రద్దీ ప్రదేశాలలోనే కాకుండా నిర్మానుష్య ప్రదేశాల్లో కూడా ఖచ్చితత్వంతో విజువల్ పోలీసింగ్ చేయడం ద్వారా నేర నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్, అనుమానితులపై నిరంతరం నిఘా ఉంచి, వారి ప్రతి కదలికను గమనిస్తూ, ఇతర నేరాలలో వారు ఇన్వాల్వ్ కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమల కుమారి, శ్రీనివాస రావు, డీఎస్పీలు వెంకటాద్రి, రవి మనోహరాచారి, శ్రీనివాసాచారి, భవ్య కిషోర్, నరసింగప్ప, ఉమామహేశ్వర్ రెడ్డి, శ్రీనివాసరావు, పైడేశ్వర రావు, శ్రీనివాసరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, ఎస్బి సిఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా కలెక్టర్ బదిలీ



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జాయింట్ కలెక్టర్‌ను ఇంచార్జ్ కలెక్టర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐఏఎస్ అధికారులు బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టి రెండున్నర నెలలు అవుతుంది. ప్రస్తుతం ప్రవీణ్ కుమార్‌ను భూగర్భ గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బదిలీ చేశారు. తిరుపతి జిల్లాకు కొత్త కలెక్టర్ రెండుమూడు రోజుల్లో ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. తిరుపతి జిల్లా కలెక్టర్‌గా పలువురు ఐఏఎస్ అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం సమర్ధవంతమైన ఐఏఎస్ అధికారిని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం.

శివయ్య సేవాభాగ్యం ఎవరికో..?

ఈవో రేసులో సాగర్ బాబు, రామారావు!

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఈవోగా ఉన్న నాగేశ్వరరావు ఈనెల 30తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో రావడానికి పలువురు ఆసక్తి కనబరుస్తున్నట్లు సమాచారం. గతంలో ఈవోలుగా పనిచేసిన కెవి.సాగర్‌బాబు, రామారావు, ప్రస్తుతం నెల్లూరు జిల్లా రెవెన్యూ అధికారిగా ఉన్న లవన్న శ్రీకాళహస్తికి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అంతేగాకుండా రెవెన్యూ అధికారిగా ఉన్న సుబ్బారావు కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆయన ఎక్కడ ఉంటున్నారో వివరాలు తెలియడం లేదు. లవన్న గతంలో శ్రీశైలం దేవస్థానం ఈవోగా పనిచేశారు. మొదట శ్రీకాళహస్తి ఎమ్మార్వో కార్యాలయంలో డీటీగా కూడా పని చేసిన అనుభవం ఉంది. అయితే స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మదిలో ఎవరున్నారో తెలియడం లేదు. ప్రస్తుతం విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం ఈవోగా ఉన్న రామారావు మరో ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ చేయమన్నారు. సాగర్ బాబు పరిపాలనపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఎవరైనా కొత్త వ్యక్తి వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయని దేవస్థానం అధికారులు అంటున్నారు. మరి శివయ్య సేవా భాగ్యం ఎవరికి కలుగుతుందో వేచి చూడాల్సిందే.

మరింత నాణ్యతగా అన్నప్రసాదం

టీటీడీ ఈవో జె.శ్యామలరావు



ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాలు అందించాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. టీటీడీ అన్నప్రసాద విభాగం కార్యకలాపాలను బుధవారం ఈవో సమీక్షించారు. టీటీడీలోని ప్రతి విభాగం పనితీరుపై తెలుసుకోవడంలో భాగంగా తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మంలతో కలిసి అన్నప్రసాద విభాగాన్ని సంబంధిత అధికారులతో కలసి ఈవో సుదీర్ఘంగా సమీక్షించారు. తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్ (ఎంటీవీఏసీ), విక్యూసీలోని అక్షయ కిచెన్, పీఏసీ 2తో పాటు, ఉద్యోగుల క్యాంటీన్, పద్మావతి అతిథి గృహం సహా తిరుమలలో అన్నప్రసాదాలు తయారు చేసే ప్రదేశాలను ఆయన సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తిచేసి, తాత్కాలికంగా నిలిపివేసిన పాంచజన్యం వంటశాలలను త్వరగా ప్రారంభించేలా చూడాలని అన్నప్రసాదం, ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. తిరుమల తిరుపతి లతో కలిపి రోజుకు సగటున తిరుమలలో 1.92 లక్షల మంది అన్నప్రసాదం స్వీకరిస్తుండగా వీరిలో తిరుమలలో దాదాపు 1.75లక్షలు, తిరుపతిలో 17 వేలు, వారాంతాల్లో తిరుమలలో రమారమి 1.95లక్షలు, తిరుపతిలో 19 వేలతో కలిపి సుమారు 2.14లక్షల మందికి అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. ఒక రోజున అన్నప్రసాదం కోసం అవుతున్న ఖర్చు దాదాపు రూ.38 లక్షలుగా ఉంది. ఈ సందర్భంగా కూరగాయల దాతలు, ఒకరోజు విరాళం పథకం తదితర అంశాలపై కూడా ఈవో సమీక్షించారు. అనంతరం భక్తులకు అందజేస్తున్న మజ్జిగలో నాణ్యత పెంచాలని, వంట చేసే స్థలంలో ఆవరణను పరిశుభ్రంగా, పొడిగా ఉంచాలని అధికారులకు ఈఓ సూచించారు. ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఫుడ్ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. తిరుమల, తిరుపతిలలో పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని పెంచడం, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా దశాబ్దాల నాటి యంత్రాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడం, అన్నప్రసాదం నాణ్యతను పెంచేందుకు ఫుడ్ కన్సల్టెంట్‌ను నియమించడం వంటి అంశాలకు సంబంధించి వీలైనంత త్వరగా అమలు చేసేందుకు పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు రావాలని సంబంధిత అధికారులను ఈఓ ఆదేశించారు. డిప్యూటీ ఈఓ రాజేంద్ర, క్యాటరింగ్ స్పెషల్ ఆఫీసర్ జిఎల్ఎన్ శాస్త్రి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థల విజయోత్సవ ర్యాలీ



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఐఐటీ జేఈఈ, ఇంటర్, నీట్ ఫలితాలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని నారాయణ విద్యాసంస్థలు తమ విద్యార్థులతో తిరుపతి నగరంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ సంస్థ డిజిఎం కొండలరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిజిఎం మాట్లాడుతూ పరీక్ష ఏదైనా తమ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో తమ ఆహ్వాన కొనసాగిస్తూనే ఉంటారని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, నిబద్ధత గల సిబ్బంది, ప్రణాళికబద్ధమైన క్రమశిక్షణతో కూడిన విద్య బోధన వల్లనే ఇవి సాధ్యమవుతున్నాయన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం ఎంఆర్ పల్లి, గాంధీ రోడ్డు, భవాని నగర్ సర్కిల్, అన్నారావు సర్కిల్ మీదుగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డీన్లు, ప్రిన్సిపాల్ లు, ఏజీఎంలు, అధ్యాపకులు,ర్యాంకులు సాధించిన విద్యార్థులు వందలాది మంది పాల్గొన్నారు.

కమిషనర్ బంగ్లా పనులు వేగవంతం



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నివాసం కోసం నిర్మిస్తున్న కమిషనర్ బంగ్లా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. బుధవారం తిరుపతి ఎస్వీ యూనివర్శిటి ప్రాంతంలోని పిల్లర్ హౌస్ ప్రాంగణంలో నిర్మిస్తున్న కమిషనర్ నివాసం కొరకు బంగ్లాను, క్యాంప్ కార్యాలయాన్ని పరిశీలించి నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. నిర్మాణ పనుల వేగవంతానికి నిరంతరం పర్యవేక్షణ వుండాలని, కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటు పనులు వేగవంతానికి కృషి చేయాలని అన్నారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డీఈ తేజశ్వీని, కాంట్రాక్టర్లు వున్నారు.

మంత్రి కొల్లు రవీంద్రకు ఘనస్వాగతం

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖల మంత్రి కొల్లు రవీంద్రకు బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో తిరుపతి నగరపాలక సంస్థ కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చిన ఆయనకు ఎస్వీఎం శ్రీధర్, సుబ్బు యాదవ్, జగన్నాథం, నాగప్రతాప్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రికి స్వాగతం పలుకుతున్న ఆర్‌సి మునికృష్ణ

మెప్మాలో మహిళలకు మర్యాద ఏదీ..?

- అధికారులతో మాట్లాడే వరకూ నిలబడే..
- వృద్ధులు.. గర్భిణులైనా.. కూర్చొవడానికి లేదు..
- స్త్రీలకు గౌరవం ఇవ్వని వారిపై చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతిలో సుమారు 5వేల పొదుపు సంఘాలు ఉన్నాయి. ఈసంఘాల పర్యవేక్షణ కోసం ఉన్న అధికారి సిఎంఎం కృష్ణవేణి దగ్గరికి నిత్యం ఏదో ఒక సమస్య, పని మీద మహిళలు వెళ్తూనే ఉంటారు. అయిన వెళ్లిన మహిళలు వృద్ధులైనా, గర్భిణులైనా, అనారోగ్యంతో బాధపడుతున్నవారైనా సరే ఆమెతో మాట్లాడేంత సేపు ఎన్ని గంటలైనా చేతులు కట్టుకుని నిలబడే మాట్లాడాలి.. తప్ప కూర్చోవడానికి వీలులేదు.. ఇదేమని అడిగితే ఈ రూమ్ సరిపోదని, కుర్చీలు లేవంటూ కబుర్లు చెబుతున్నారు.. తప్ప కూర్చునే అవకాశం కల్పించడం లేదు.. దీనిపై ఐద్వా జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎం. జయంతి, పి.సాయిలక్ష్మీ మాట్లాడుతూ మహిళలు కష్టపడి సంపాదించిన వారి డబ్బుతో సంఘాలు నడుపుతూ బ్యాంకులకు చెల్లిస్తున్నారని, ఆ డబ్బును జీతాలుగా తీసుకుంటున్నా అధికారులు మాత్రం స్త్రీలకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది అధికారులు మహిళలు ఉన్నప్పటికీ మిగిలిన ఆడవారి పట్ల హీనంగా చూడటం శోచనీయమన్నారు. ఇకనైనా పై అధికారులు స్పందించి మెప్మాలో తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే మహిళలకు కనీస మర్యాద లభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మెప్మా కార్యాలయంలో సంఘాల మహిళలు నిలబెట్టి మాట్లాడిస్తున్న దృశ్యం

జూలై 11 వరకు 'నేను బడికి పోతా కార్యక్రమం'

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండేలా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన 'నేను బడికి పోతా' అనే బడి ఈడు పిల్లలను అందరినీ బడిలో చేర్చే కార్యక్రమం కొరకు జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి జూలై 11 వరకు ఇంటింటికీ గ్రామ వాలంటీర్లు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యులు తిరిగి పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడిఈడు పిల్లలు 6 నుండి 14 సంవత్సరాల లోపు వారిని గుర్తించి అందరినీ వారి విద్యార్హత మేరకు సంబంధిత పాఠశాల తరగతుల్లో నమోదు చేసి వారికి విద్యాకానుక కిట్లు అందించాలన్నారు. సంబంధిత తరగతి టీచర్లు సదరు విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని గుర్తించి సంబంధితపై అధికారులకు నిర్దేశిత ప్రోఫార్మలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. జూలై 12 నాటికి తమ గ్రామ, హ్యాబిటేషన్ పరిధిలో బడిబయటి పిల్లలు లేరని, అందరూ బడిలో చేర్చడం జరిగిందనీ ధృవీకరించాల్సి ఉంటుందని, సదరు వివరాలు సమర్పించాలని సూచించారు. విద్యాశాఖ, సమగ్రశిక్షా, స్త్రీ శిశు సంక్షేమశాఖ, కార్మికశాఖ, మెప్మా, గ్రామ వార్డు సచివాలయం అధికారులు, రవాణా శాఖ, సంక్షేమ హాస్టళ్ల తదితర శాఖల అధికారులు అందరూ వారి వారి పరిధిలో చక్కగా బాధ్యతలు నిర్వర్తించాలని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ తదితర సంక్షేమ హాస్టల్స్‌లో పిల్లల నమోదుకు నిబంధనల మేరకు చర్యలు ఉండాలని, రక్షిత తాగునీరు, నాణ్యమైన ఆహారం పిల్లలకు అందేలా, వంటగది, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఈవర్షాకాలంలో కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారిని సుశీల దేవి, గిరిజన సంక్షేమ అధికారిని, ప్రాజెక్ట్ డైరెక్టర్ మెప్మ రాధమ్మ, సమగ్ర శిక్షా అధికారులు ఎన్సిఎల్పీ తదితర అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా నిలబడదాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పేదవిద్యార్థులకు అండగా నిలబడదామని ప్రముఖ సంఘ సేవకులు యల్లంపాటి కోటేశ్వరబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని తుఫాను మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చదివే సుమారు 50 మంది విద్యార్థులకు బుధవారం ఆయన విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యల్లంపాటి కోటేశ్వరబాబు మాట్లాడుతూ నిరుపేద గిరిజన విద్యార్థులకు విద్యా సామాగ్రి అందచేయడం తనకు ఎంతో సంతృప్తి నిస్తోందన్నారు. గిరిజన విద్యార్థుల్లోని ప్రతిభ వెలికి తీస్తే వారు తప్పకుండా ఉన్నత స్థానాలకు చేరుకుంటారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఆశయంతోనే తాను గిరిజన విద్యార్థులకు విద్యాసామాగ్రి ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. గిరిజనులు సామాజికంగా, ఆర్థికంగా బాగా వెనుకబడి ఉన్నందున వారి పిల్లలకు చదువులో ప్రోత్సహించడానికి ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు ఆయన వివరించారు. భవిష్యత్తులో కూడా ఈసేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని యల్లంపాటి కోటేశ్వరబాబు చెప్పారు.



శెట్టిపల్లిలో భూవివాదం

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 85లో గల భూమిలో భూవివాదం చోటు చేసుకుంది. 2013లో శ్రీహరి అనే వ్యక్తి నుంచి ఏఆర్ కానిస్టేబుల్ అప్పలనాయుడు 300 అంకణాలను రూ.7.40లక్షలకు కొన్నానని, కానీ చంద్రగిరి మండలం తొండవాడకు చెందిన శరత్‌బాబు, హేమచంద్ర అనే వ్యక్తులు స్థలం తమదంటూ స్థలంలో దిగి నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నించడంతో భూవివాదం చోటు చేసుకుంది. మంగళవారం స్థలంలో శరత్‌బాబు, హేమచంద్ర మరికొందరు గది నిర్మాణం చేస్తున్నడంతో ఏఆర్ కానిస్టేబుల్ అప్పలనాయుడు వెళ్లి అడ్డుకోగా ఘర్షణ వాతావరణం మొదలైంది. ఈ స్థలవివాదంపై ఐదు నెలలకు ముందు ఇదే పరిస్థితి రావడంతో సంబంధిత అలిపిరి పోలీస్‌స్టేషన్లో అప్పటి సీఐ రామచంద్రారెడ్డి వద్ద ఇరువర్గాలను పిలిచి స్థలవివాదాలు రెవెన్యూ విభాగం అధికారుల చేత పరిష్కరించుకోవాలి గాని గొడవలకు దిగడం మంచి పద్ధతి కాదని చెప్పి, అసలైన భూ యజమాని ఎవరో? తేల్చాలని రెవెన్యూ అధికారులకు లేఖ రాయడం జరిగిందని, అప్పటివరకు ఎవరిని వివాద స్థలంలోకి అనుమతించరాదని రెవెన్యూ అధికారులను కోరినట్లు అలిపిరి సీఐ రామారావు తెలిపారు. అయితే భూ వివాదం సమస్య సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో తిరుపతి అర్బన్ మండల రెవెన్యూ అధికారులను ప్రజాశక్తి వివరణ కోరగా ఆ భూమి చెరువు పోరంబోకు సంబంధించిందని, పూర్తి సమాచారం వివరాలు కనుక్కొని చెబుతానని అర్బన్ మండల తహశీల్దార్ చెబుతున్నారు. ఇదిలా ఉండగా గతంలో వీరికి కొందరి అధికారుల సహాయసహకారం వల్ల కరెంటు మీటర్లు, ఇంటి పన్నులు వచ్చినట్టుగా సమాచారం.

వివాద స్థలంలో చేపట్టిన నిర్మాణాలు




కోర్టులో పెండింగ్ అంశాలపై పూర్తి స్థాయిలో

పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: భూసేకరణ అంశాలపై కోర్టులో పెండింగ్ అంశాలపై పూర్తిస్థాయిలో పరిష్కారదిశగా త్వరితగతిన అధికారులు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. ల్యాండ్ అక్విజిషన్‌లో కోర్టు కేసులు ప్రభుత్వానికి అనుకూలంగా పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ల్యాండ్ అక్విజేషన్ అంశాలకు సంబంధించిన కోర్టు కేసులపై సంబంధిత అధికారులు త్వరితగతిన సకాలంలో తగుచర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి అలసత్వం ఉండరాదని, సదరు కేసులు త్వరితగతిన పరిష్కారం అయ్యేవిధంగా తీసుకోవలసిన చర్యల గురించి ఏపిఐఐసి, రెవెన్యూ, కలెక్టరేట్ లీగల్ వింగ్, శ్రీసిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందులో హైకోర్టులో ప్రధానంగా కేసు నమోదు అయినప్పుడు కౌంటర్ దాఖలు చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సమీక్షించి సూచనలు ఇచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు వచ్చిన కేసుల్లో తప్పకుండా రివ్యూ పిటిషన్ వేయడం, అవసరమైతే సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పి దాఖలు చేయడం వంటి చర్యలు తీసుకోవలసినదిగా సూచించారు. తహసీల్దార్ కౌంటరు ఫైలు చేసేటప్పుడు కలెక్టర్ వారి నోటీసుకు కూడా తీసుకెళ్లాలని సూచించారు. ఇలాంటి అన్ని కేసుల్లో అప్రమత్తంగా వ్యవహరించి ప్రభుత్వ లాయర్లతో సమన్వయం చేసుకొని సరైన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో లీగల్ సెల్ ఎస్డిసి మురళి, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ తిరుపతి చంద్రశేఖర్, ఏపీఐఐసీ నెల్లూరు జోనల్ మేనేజర్ విజయరత్నం, తిరుపతి ఏపీఐఐసీ డీఈఎం జవహర్ బాబు, భగవాన్ శ్రీసిటీ ప్రతినిధులు రామచంద్ర రెడ్డి, కలెక్టరేట్ లీగల్‌సెల్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా తన క్యాంపు కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టిన జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, పిఎసి సభ్యులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని జ్ఞాపకంగా అందించి శుభాకాంక్షలు తెలిపారు.



డిప్యూటీ సీఎం పవన్ కు జ్ఞాపికను ఇస్తున్న హరిప్రసాద్

మహిళా వర్సిటీకి రూ.50 లక్షల నిధులు



ప్రజాశక్తి - క్యాంపస్ : రూసా సపోర్ట్ ఫర్ రీసెర్చ్ ప్రాజెక్ట్స్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ అనే అభివృద్ధి పథకం కింద శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పనిచేసేటటువంటి వివిధ అధ్యాపకులకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందని విసి ఆచార్య డి.భారతి వెల్లడించారు. ఈనిధుల ద్వారా అధ్యాపకులు రీసెర్చ్ ప్రాజెక్ట్స్‌ను ప్రారంభించనున్నారు. ఈ అధ్యాపకులు వారివారి రంగాలలో నూతన నవీకరణ అంశాలను పొందుపరచడం ద్వారా వారికి ఈ ప్రాజెక్ట్ నిధులను విడుదల చేయటం జరిగిందని మహిళా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య డి.భారతి తెలిపారు. అధ్యాపకులను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజినీ, సోషల్ సైన్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ పి.వాణి అభినందించారు. వీరికి ఒక్కొక్కరికి రూ.5 నుంచి 3లక్షల వరకు నిధులు మంజూరు చేయడం జరిగింది. నిధులు మంజూరు చేయబడిన వారు. ప్రొఫెసర్లు సీతాకుమారి, సారా సరోజినీ, హిమబిందు, కవితా తులసి, జయలక్ష్మి, బి.విజయలక్ష్మి, కాత్యాయని, వైఎస్.శారద, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీలో మహిళలకు సముచిత స్థానం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టీడీపీలో మహిళలకు సముచిత స్థానం లభిస్తుందని రాష్ట్ర హోం మినిస్టర్‌గా వంగలపూడి అనిత నియామకమే నిదర్శనమని ఆ పార్టీ తిరుపతి మహిళా నాయకురాలు అనిత పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వ హయంలో మహిళలపై అనుచిత ధోరణులు, వేధింపులు, హత్యలు జరిగాయని, వీటన్నింటిపై నమోదైన కేసులను తిరిగి తెరచి వాస్తవాలను వెలుగులోనికి తెస్తూనే కారకులకు కఠిన శిక్షలు పడేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. దిశా చట్టాన్ని మహిళా చట్టంగా మార్పు చేయాలని హోం మంత్రి ఆకాంక్షిస్తున్నారన్నారు. నారి శక్తి బృందాలను ఏర్పాటు చేసి మహిళల భద్రతకు పెద్దపీట వేయడానికి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు చేసిందన్నారు. హేమ, లత, నీలిమ, సుజాత, రేవతి పాల్గొన్నారు.

పాకాల ఎస్ఐగా లోకేష్‌కుమార్

ప్రజాశక్తి-తిరుపతిడెస్క్: పాకాల అదనపు ఎస్ఐగా ఆర్.లోకేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తిరుపతి విఆర్ నుంచి బదిలీ అయ్యారు. శాంతిభద్రతల దృష్ట్యా ఉన్నతాధికారులు పాకాలకు అదనపు ఎస్ఐని నియమించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు బజార్‌లో చెత్త తొలగించండి

- మాజీ కౌన్సిలర్ శివకుమార్

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పాత బస్టాండ్ సమీపంలో ఉన్న రైతు బజార్ డంపింగ్ యార్డ్ లా తయారయిందని సంబంధిత అధికారులు వెంటనే చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని మాజీ కౌన్సిలర్ శివకుమార్ కోరారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని రైతు బజార్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా దేవాదాయ శాఖకు చెందిన స్థలంలో రైతు బజార్ ఉన్నదని అయితే కొత్త రైతు బజార్ ఏర్పాటు కావడంతో దుకాణాలు అక్కడికి మార్చడం జరిగిందని తెలిపారు. దీంతో పాత రైతు బజార్ చెత్తతో డంపింగ్ యార్డ్ లా తయారయిందని దేవాదాయశాఖ అధికారులు వెంటనే చెత్తను తొలగించాలని కోరారు.

వైభవంగా సింహ వాహన సేవ

ప్రజాశక్తి-రామచంద్రాపురం: టీటీడీ అనుబంధ ఆలయం అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం స్వామివారు సింహ వాహనంపై నరసింహస్వామి అలంకరణలో నాలుగు మాడవీధులలో ఊరేగారు. సాయంత్రం ముత్యము పందిరి వాహనంలో స్వామి విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఏఈఓ రమేష్, సూపరిండెంట్ శ్రీవాణి టెంపుల్ ఇన్స్పెక్టర్ శివకుమార్, అధికారులు పాల్గొన్నారు.

శారదమ్మకు నివాళి

ప్రజాశక్తి-తిరుపతిడెస్క్: పాకాల పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు జగదీష్ చౌదరి తల్లి శారదమ్మ ఇటీవల మృతి చెందారు. కర్మక్రియలు బుధవారం నిర్వహించారు. కర్మక్రియల్లో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

విద్యాసామగ్రి వితరణ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మండల పరిషత్ పాఠశాలల విద్యార్థులకు దాత డాక్టర్ బసంతి ఆధ్వర్యంలో బుధవారం విద్యా సామగ్రిని అందజేశారు. నోటు పుస్తకాలు, బలపాలు, పెన్నులు, పెన్సిల్‌లు, రబ్బర్ తదితర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో పురుషోత్తం రాజు, శ్రీహరి, పాఠశాల ఛైర్మన్ శాంతి, సుభాషిని, హెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు కేశవులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధి పట్ల అవగాహన



వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-వెంకటగిరి: అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి రాజేష్ ఆధ్వర్యంలో బుధవారం పాత శివాలయం సచివాలయం పరిధిలో గిరిజన సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం పలువురికి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ రక్తహీనత కండరాల నొప్పి, కళ్ళు పసుపు రంగులోకి మారడం తదితర లక్షణాలు కనిపించిన వెంటనే రోగులు నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషన్ ఫయాజ్, సచివాలయం హెల్త్ సెక్రటరీ సత్యవేణి, అడ్మిన్ సుబ్బారాయులు, మహిళా పోలీస్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: పంచాయతీ కార్యదర్శి ఇందిర ఆధ్వర్యంలో సర్పంచి వెంకటమ్మ అధ్యక్షతన ప్రపంచ సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనపై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది.

పాఠశాల తనిఖీ



ప్రజాశక్తి-తిరుపతిడెస్క్: ఏర్పేడు మండలంలోని పెనుగడ్డం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జేఏసీ, ఎస్సీ-ఎస్టీ జిల్లా కన్వీనర్ జి.ఏకాంబరం ఆధ్వర్యంలో పాఠశాలను తనిఖీ చేశారు. టీచర్స్‌తో కలిసి పిల్లల చదువు, సదుపాయాలు గురించి అడిగి తెలుసు కున్నారు. తదుపరి బాత్రూమ్స్, ఆర్ఓ ప్లాంట్‌ను తనిఖీ చేసి ఆర్ఓ ప్లాంట్ పైన మాజీ సీఎం జగన్ ఫోటోను తొలగించారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం), తిరుపతి టౌన్: కేంద్ర పార్లమెంటరీ ప్రతిపక్ష నేత కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం తిరుపతి నగర కాంగ్రెస్ అధ్యక్షులు యార్లపల్లి గోపి ఆధ్వ ర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. గోపి మాట్లాడుతూ కేంద్రంలోని మతతత్వ బిజెపి ప్రభుత్వం కుల మతాలకు చిచ్చుపెట్టి పాలన చేస్తోందని, జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా ప్రజలు తమ మద్దతు తెలపడం శుభపరిణామం అన్నారు. త్వరలోనే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి పీఠాన్ని అధిరోహించి దేశంలో సుపరిపాలన తీసుకొస్తారని ఆశాభా వం వ్యక్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుప్రజ, నాగరాజు, మున్వ ర్, రవి, ఎన్ఎస్‌యుఐ తిరుపతి అధ్యక్షులు షేక్ జావేద్, శాంతి యాదవ్, తేజోవతి, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా సుబ్బారెడ్డినగర్‌లో గౌడపేర చిట్టిబాబు ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ 54వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శివశంకర్, గోపి, రాజు, గురవయ్య, వెంకటాద్రి, రాజగోపాల్ పాల్గొన్నారు.

సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బాలగురువం బాబు ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ 54వ పుట్టినరోజు సందర్భంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌కే గౌస్ బాషా, మణి, రఘు పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు

- ఎస్పీ హర్షవర్ధన్ రాజు



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా చేయడమే ట్రాఫిక్ పోలీసుల ప్రధాన కర్తవ్యం అని ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. స్థానిక పోలీస్ పేరెడ్ మైదానంలో ట్రాఫిక్ పోలీసులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నగరంలో అమలవుతున్న ట్రాఫిక్ ప్రణాళికను సమీక్షించి, తగిన సూచనలు చేస్తూ నూతన ప్రణాళికను దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ తను విధులు నిర్వర్తిస్తున్న పాయింట్ గురించి, పరిసర ప్రాంతాల గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే ట్రాఫిక్‌ను సమర్థవంతంగా క్రమబద్ధీకరణ చేయవచ్చును అని తెలిపారు. నగరాన్ని 6 సెక్టార్లుగా విభజించి, 12 వైట్ కోల్ట్స్ వాహనాల ద్వారా తిరుగుతూ, రోడ్లపై వాహనాలను విచ్చలవిడిగా పార్కింగ్ చేయనీయకుండా చర్యలు తీసుకుంటూ, ఆ సెక్టార్లలోని ట్రాఫిక్ సిబ్బందిని సమన్వయపరచుకుంటూ, ట్రాఫిక్ జామ్ జరగకుండా సమర్థవంతంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేయాలని సూచించారు. పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ ఐలాండ్స్, ముఖ్యమైన కూడళ్ళు, వన్ వే రోడ్ల దగ్గర నియమించబడిన సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించి, అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు ట్రిబుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు వంటి ఎన్ఫోర్స్మెంట్ విధులను గట్టిగా నిర్వర్తించాలని ఆదేశించారు. అదే సమయంలో వాహనదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఎట్టి పరిస్థితులలో కూడా అసభ్య పదజాలాన్ని ఉపయోగించి దూషించరాదని సూచించారు. ఎండైనా, వానైనా లెక్కచేయకుండా విధి నిర్వహణలో నిమగ్నమై ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చిత్తశుద్ధితో పనిచేసిన వారిని ప్రశంసిస్తూ వారి పేర్లను రివార్డులకు పంపించాలని ట్రాఫిక్ డిఎస్పీని ఆదేశించారు. నగరంతో పాటు నగర శివారు ప్రాంతాలలో కూడా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేసేందుకు అదనంగా అవసరమైన 20మంది హోంగార్డులను, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు ఎస్పీ నియమించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, డిఎస్పీలు వెంకటాద్రి, రమణ కుమార్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



ప్రమాదంలో చిక్కుకున్న డ్రైవర్‌ను కాపాడుతున్న ఎమ్మెల్యే, సిబ్బంది

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

- రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌ను రక్షించిన ఎమ్మెల్యే, సిబ్బంది

ప్రజాశక్తి-రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మానవత్వాన్ని చాటుకున్నారు. పాకాల నుంచి తిరుపతికి వస్తున్న ఎమ్మెల్యే నాని ఆయన ముందు వెళుతున్న టమోటా లోడ్ వాహనం మామండూరు సమీపంలో అదుపుతప్పి ప్రమాదానికి గురై బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ కిరణ్ కుమార్ వాహనంలో చిక్కుకున్నాడు. ఎమ్మెల్యే పులివర్తి నాని వెంటనే తన వాహనాన్ని ఆపి సిబ్బంది సహకారంతో కిరణ్‌కుమార్‌ను బయటకు తీసుకువచ్చారు. గాయాలైన కిరణ్‌ను తన వాహనంలో ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నం చేశారు. ఇంతలో హైవే పెట్రోలింగ్ వాహనం రావడంతో కిరణ్‌ను హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే వైద్యులకు సూచించారు. జాతీయ రహదారిపై అత్యంత జాగ్రత్తగా ప్రయాణించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని ప్రయాణికులకు ఆయన సూచించారు. వాహనదారులు భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు.

'పరిశోధకులు సోషల్ సైన్స్ విభాగంలో జర్నల్‌ని గుర్తించాలి'

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీ యూనివర్సిటీ పాపులేషన్ స్టడీస్, సోషల్ వర్క్ విభాగాలు, లైబ్రరీ సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో యూజీసీకి జర్నల్, య్యుజిసి కేర్ జర్నల్స్ ఇన్ హ్యూమానిస్ అండ్ సోషల్ సైన్సెస్ "హ్యూమానిటీ అండ్ సోషల్ సైన్సెస్‌లో ఉన్న జర్నల్స్, ఆ జర్నల్స్ లో పరిశోధనా పత్రాలను ఎలా ముద్రించుకోవాలి" అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపల్ ఆచార్య జి.పద్మనాభం మాట్లాడుతూ యుజిసి కేర్ జర్నల్స్‌లో ముద్రించిన ప్రచురణలు అకడమిక్ పరంగా అభివృద్ధి చెందడానికి ప్రతి ఒక్కరికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ వర్క్‌షాప్ నిర్వాహకులు ఆచార్య టి.చంద్రశేఖరయ్య, ఆచార్య డి.సాయి సుజాత గార్లు వర్క్ షాప్ ముఖ్య ఉద్దేశం, ఆవశ్యకతను గురించి వివరించారు.

తాగునీటి సమస్యకు పరిష్కార చర్యలు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పట్టణంలోని నెత్తం ప్రజల దాహార్తిని తీర్చడం కోసం పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు సాకారంతో రూ.1.50లక్షల వ్యయంతో పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. గ్రామస్థులు కుప్పారెడ్డి, శ్రీనివాసులు, బలరామయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న వీఆర్ఏలు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని గూడూరు నియోజకవర్గ పరిధిలోని వీఆర్ఏలు బుధవారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు విన్నవించారు. తమకు గత ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రాలేదని వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం తమకి ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేదన్నారు. వేతనాలపై జీవించే తాము ఎంతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం ద్వారా తమకు వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పుస్తక పఠనంతోనే పురోగతి సాధ్యం: ప్రకాష్ బాబు



ప్రజాశక్తి-క్యాంపస్: విద్యార్థులకు పుస్తక పఠనంతోనే పురోగతి సాధ్యమని ప్రిన్సిపాల్ సి.ప్రకాష్ బాబు పేర్కొన్నారు. ఎస్వీ జూనియర్ కళాశాలలో జాతీయ పఠన దినోత్సవాన్ని బుధవారం కాలేజీ ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సి.ప్రకాష్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవడం, జ్ఞానోదయం పొందడం వ్యక్తిగత, సామాజిక పరివర్తనకు పునాదని, పుస్తక పఠనం ద్వారానే విద్యార్థులకు పురోగతి సాధ్యమని, ప్రస్తుత సాంకేతిక విప్లవంలో పిల్లలకు పుస్తక పఠనంపై ప్రేమ కలిగేటట్లు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఒక మంచి పుస్తకానికి జీవిత గమనాన్నిమార్చే శక్తి వున్నదని, జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుందని, సృజనాత్మకతను ప్రేరేపిస్తుందని, పుస్తక పఠనం మానసిక సంస్కారాన్ని కలిగిస్తుందని, విషయ పదజాలాన్ని నిర్మిస్తుందని, ఒత్తిడిని తగ్గిస్తుందని, విజ్ఞాన విస్తరణకు తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ వెంకటరమణమ్మ, పిజి.లావణ్య, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారుపేట పోలేరమ్మ జాతర ప్రారంభం

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి మున్సిపాలిటీలోని బంగారుపేట గ్రామ శక్తి పోలేరమ్మ జాతర అత్యంత వైభవంగా బుధవారం ప్రారంభమైంది. ప్రతి తొమ్మిది సంవత్సరాలకు ఒకసారి బంగారుపేటలో అమ్మవారి జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా అమ్మవారి ఇంట సాంప్రదాయబద్ధంగా భక్తు ల కల్పవల్లి పోలేరమ్మ తల్లి ప్రతిమను బుధవారం చేశా రు. అర్ధరాత్రి అమ్మవారిని వేలాది మంది భక్తుల కేరింతల నడుమ, బాణాసంచా పేలుళ్ల మధ్య, ప్రత్యేక కాంతులతో చావిడి పక్కనే ఉన్న ఆలయం వద్దకు తీసుకొ చ్చారు. గురువారం తెల్లవారుజాము నుంచి సాయం త్రం వరకు అమ్మవారిని భక్తులదర్శనార్థం అక్కడే ఉం చుతారు. గురువారం సాయంత్రం ప్రత్యేక రథంపై అమ్మవారి గ్రామోత్సవం జరుగనుంది.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

జాతర వేడుకలో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించిన నాయుడుపేట క్రాంతి ఈవెంట్స్ వారిచే పాటకచేరి, కాంతారావు ప్రోగ్రాం పుంగనూరు వారి డ్రమ్స్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గురువారం గ్రామోత్సవం సందర్భంగా కేరళ డ్రమ్స్, బంగారుపేట బ్యాడ్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక డీజే ప్రోగ్రాం, నవదుర్గల ప్రోగ్రాం, లక్ష్మీపురం కొన్నపూడి వారిచే కోలాటం ఒంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెంకటగిరి సీఐ సంగమేశ్వర రావు తెలిపారు.

వైభవంగా గంగ జాతర

ప్రజాశక్తి-రామచంద్రపురం: మండలంలో గంగ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. బుధవారం మండలంలోని సొరకాయల పాల్యం, తిమ్మరాజు పల్లి, నెత్తకుప్పం హరిజనవాడ గ్రామాలలో గంగ జాతర వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున గంగమ్మ ప్రతిమను పసుపు ముద్దలతో ప్రతిష్ట చేసి, అమ్మవారికి బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. గ్రామాల్లోని ప్రజలు మహిళలు అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సొరకాయల పాల్యం గ్రామంలోని గంగమ్మకు స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి (సారె)చీర జాకెట్ పసుపు కుంకుమ, బుందారాలు, పూలు పండ్లు తీసుకొచ్చారు. నాయకులు కాయం చంద్రబాబు, వినోద్, చెంగయ్య, మోహన్ యాదవ్, మాధవయ్య, వెంకటముని, అనిల్, తిరుమలరెడ్డి, జనార్దన్ చౌదరి, రవి, ఉమాపతి నాయుడు, నీలకంఠ చౌదరి, పూజారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

ప్రజాశక్తి-సత్యవేడు: తనపై దాడి చేశారని బాధితుడు ఎస్.ఆర్పుద రాజ్ పోలీసులను ఆశ్రయించారు. బుధవారం సత్యవేడు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. మదనంబేడు వీఎస్ఎస్ కమిటీ అధ్యక్షులుగా ఉన్న తనను వైసీపీ ఉపసర్పంచ్ భర్త హరిబాబు వీఎస్ఎస్ స్థలాన్ని కబ్జా చేస్తుండగా అడ్డుకోబోతే దాడి చేశారని పోలీసుల వద్ద ఆర్పుదరాజ్ మొరపెట్టుకున్నారు. ఆ మేరకు న్యాయం చేయాలని కోరారు.

నెలబల్లిలో హుస్సేనమ్మ 54వ గంధ మహోత్సవం

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండల పరిధిలోని నెలబల్లిలో శ్రీ హుస్సేనమ్మ 54వ గంధ మహోత్సవం గురువారం నుంచి మూడు రోజులపాటు జరుగుతుందని దర్గా కమిటీ సభ్యులు ముత్యాలయ్య, జాన్, రమేష్, రాజేంద్రప్రసాద్, ముని రాజా, ముని రామయ్య, జకరయ్య, వేణు చంద్ర తెలిపారు. భక్తులెల్లరు తమ కోరిన కోర్కెలు తీర్చుకునేందుకు గంధ మహోత్సవంలో పాల్గొనాలని కోరారు. 21న రాత్రి ఆర్కెస్ట్రా కార్యక్రమంలో పాట కచేరి నిర్వహిస్తారు. అదేవిధంగా 23న జబర్దస్త్ టీం సభ్యుల ద్వారా ఎన్నో రకాల హాస్యాస్పద కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు.

చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనం మెగా డీఎస్సీపై తొలి సంతకం

- మంత్రి నారా లోకేష్‌తో విద్యావ్యవస్థ ప్రక్షాళన
- వంద శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయాలి
- స్కూల్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని





ప్రజాశక్తి-రామచంద్రపురం: సీఎంగా ప్రమాణస్వీకారం చేసి తొలి సంతకం మెగా డీఎస్సీపై పెట్టడం సీఎం చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకటమణి ప్రసాద్(నాని) అన్నారు. బుధవారం మండలంలోని కమ్మకండ్రిగ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామాగ్రి (స్కూల్ కిట్స్) పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను అడ్డం పెట్టుకొని అనేక అక్రమాలకు పాల్పడిందన్నారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా నియమితులైయ్యారన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామని స్పష్టం చేశారు. వంద శాతం ఉత్తీర్ణత తీసుకురావడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. వారం రోజుల్లో పాఠశాలలో క్రీడలకు, ల్యాబ్‌కు కావల్సిన పరికరాలను సొంత నిధులతో అందిస్తానని తెలిపారు. అలాగే 6మండలాల్లో ఉన్న పాఠశాలల సంఖ్య, మరమ్మతులు వివరాలకు సంబంధించిన నివేదిక కోరానని అన్నారు. కార్యక్రమంలో తిరుమల రెడ్డి, ఆరి లీలామోహన్ నాయుడు, ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ, సురేష్, సర్పంచ్ కావ్య, ఉపసర్పంచ్ వేణుగోపాల్, ఎంఈఓ మార్కండేయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం(చంద్రగిరి): ఏపీ విద్యా, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. బుధవారం చంద్రగిరిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో స్కూల్ కిట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. మొదట స్కూల్ ఆవరణలో చెట్లు నాటారు. ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ రోజున ఉపాధ్యాయులు విప్లవం సృష్టించారని అన్నారు. దేశ వ్యాప్తంగా ఐటి రంగం అభివృద్ధికి పునాది వేసింది సీఎం చంద్రబాబు అని గుర్తు చేశారు. చంద్రగిరిలో చాలా అభివృద్ధి జరగాల్సి ఉందన్న ఆయన పార్టీలకు అతీతంగా అందరూ కలిసి వస్తే 4ఏళ్లలో మార్పు తీసుకురావచ్చుని ధీమా వ్యక్తం చేశారు. పాఠశాలల పాత భవనాలు స్థానంలో కొత్త భవనాలు నిర్మించడం, కాంపౌండ్, కిచెన్, మరుగుదొడ్ల మరమ్మతులు నివేదిక అందజేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కాలేజ్‌లో బయట వ్యక్తులు వచ్చి అసాంఘిక కార్యకలాపాలు పాల్పడితే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి హేమేంద్రకుమార్ రెడ్డి, జెడ్పీటీసీ యుగుంధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, మాజీ జెడ్పీటీసీ రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గౌస్ బాషా, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ ముడిపల్లి సురేష్, సర్పంచ్ రూప రామ్మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయండి

అధికారులకు జనసేన నాయకుల వినతి

ప్రజాశక్తి - రామకుప్పం: ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జనసేన మండల అధ్యక్షుడు హరీష్, ఇతర సభ్యులు ఎంపీడీవో ఈశ్వరయ్య, తహశీల్దార్ శ్రీధర్ కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, గ్రామీణ రక్షిత మంచినీటి పథకం, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను విరివిగా అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి పేదవారికి ఈ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్, పవన్, గంగాధర్ ,భాస్కర్, సురేష్, ఈశ్వర్, గజేంద్ర, హరీష్, మునెప్ప, మహేష్, సుభాన్ పాల్గొన్నారు.

సర్పంచ్ చొరవతో డ్రైనేజీలు ఏర్పాటు

ప్రజాశక్తి -గంగవరం: మండ లంలోని కీలపట్ల పంచాయతీ యానాది కాలనీలో సర్పంచ్ చంద్రశేఖర్ డ్రైనేజీలు ఏర్పా టు చేశారు. ఆ కాలనీని గతంలో పరిశీలించిన సర్పం చి ఆ కాలనీ పరిస్థితులను గుర్తించి వెంటనే ఏర్పాటు చేయించినట్లు తెలిపా రు. మండలంలోని కీలపట్ల పంచాయతీ యానాది కాలనీలో ఎంత వరకు డ్రైనేజీ లు కలవక పోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్ దృష్టికి రావడంతో యానాది కాలనీకి చేరుకున్న సర్పంచి ఆ కాలనీ పరిస్థితులను గుర్తించి వెంటనే ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. చిన్నపాటి వర్షానికి వీధులలో నీరు నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ముఖ్యంగా రాత్రి సమయంలో కాలనీ వాసులకు ఇబ్బంది కరంగా ఉందన్న సమాచారం తన దృష్టికి రాగానే డ్రైనేజీ పనులు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

వేలం పాటలో రూ.5.86 వేల ఆదాయం

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో వారపు సంత , ప్రైవేటు బస్టాండు నిర్వహణ కోసం బుధవారం నిర్వహించిన వేలం పాటలలో 5.86 లక్షల ఆదాయం లభించినట్లు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ తెలిపారు. వారపు సంతకు 5లక్షలా 15వేలు, ప్రైవేటు బస్టాండ్‌కు 71వేల500 రూపాయల ఆదాయం లభించిందని తెలిపారు.

'ఇంటింటికీ ఆరోగ్యం రాస్ ఆశయం'



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ఇంటింటికీ ఆరోగ్యం రాస్ ఆశయం అని హెచ్ఎం ప్రకాష్‌కుమార్ అన్నారు. బుధవారం రాష్ట్రీయ సేవా సమితి (రాస్), రైతుల సంఘాల ఆధ్వర్యంలో టాటా ట్రస్టు వారి సహకారంతో స్థానిక భాకరాపేట, గాండ్లపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రధానోపాధ్యాయులు బి.ప్రకాష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిల్లిపాది ఆనందంగా, ఆరోగ్యంగా జీవించడానికి రాస్, టాటా ట్రస్ట్ వారు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. రాస్ సంస్థ ముందు చూపుతో రైతులలో, మహిళలలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించడమే కాకుండా ప్రజలు ఉండే ప్రాంతాలకు వైద్య బృందాన్ని తీసుకొచ్చి ఉచితంగా పరీక్షలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. రాస్ అధికారి సివి నాయుడు మాట్లాడుతూ కోవిడ్-19 నేర్పిన పాఠాల నుంచి ప్రజలు జీవనం విధానాన్ని, ఆరోగ్య విధానంలో తగు జాగ్రత్తలు తీసుకొని వ్యాధి నిరోధక శక్తినిచ్చే సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. మానవ శరీరంలో బరువు తగ్గుతూ, క్రమంగా జ్వరం రావడం, తలనొప్పి రావడం, మూత్రనాళాల్లో రక్తం రావడం, నీరసంగా ఉండడం తదితర కారణాల వున్నట్టయితే వ్యాధి నిర్ధారణ కోసం వైద్యుని సంప్రదించి పరీక్షలు చేయించి, వైద్య బృందం ఇచ్చే సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిపి, షుగర్, హెపటైటిస్ పరీక్షలు 150మందికి పరీక్షలు ఉచితంగా చేయడం జరిగింది. ఈ ఉచిత వైద్యశిబిరంలో రాస్ సిబ్బంది భానుకుమార్, లీడర్లు ఉమామహేశ్వరి, సిద్ధమ్మ, భువనేశ్వరి, కవిత తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే ఉపేక్షించం

- రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి



ప్రజాశక్తి-గూడూరు టౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఉపేక్షించేది లేదని గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, వాహనాలు నడిపిన, ఇతర వాహనాలకు ఇబ్బంది కలిగేలా నడపడం ప్రజలకు అసౌకర్యం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం గూడూరు రూరల్ పరిధిలోని పంబ లేరు బ్రిడ్జి సమీపంలో ఉన్న వైన్ షాప్ పరిసరాలను స్థానికుల సాయంతో శుభ్రం చేయించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రేణిగుంట: పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించడం, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ మల్లికార్జున తెలిపారు. బుధవారం పట్టణంలోని పలు చోట్ల ఆకస్మిక తనిఖీ చేపట్టారు. వైన్ షాపు పరిసరాలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

